క్లుప్తంగా

వేడుకగా సీతారాముల కల్యాణం



సీతారాములుకు పూజలు చేస్తున్న ఉభయకర్తలు

ఓజిలి: మండలంలోని పెదపరియ రాచపాళెం గ్రామంలోని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను మండపంలోకి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. గ్రామానికి చెందిన దొమ్మరాజు మోహన్‌రాజు-సరస్వతి, డి.ఓబులురాజు-శ్యామల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి 500 మందికి అన్నదానం చేశారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం సైబర్ సెక్యూరిటీ ఫండమెంటల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్స్ అనే అంశంపై సుప్రజా టెక్నాలజీస్ సంస్థ వర్క్‌షాప్ నిర్వహించింది. టెక్నాలజీ నిపుణులు శివప్రతాప్‌రెడ్డి సైబర్ సెక్యూరిటీలోని వివిధ అంశాలపై వివరించారు. సాంకేతిక విభాగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్క్‌షాప్ నాలుగు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ రాజశేఖర్‌రెడ్డి, నారాయణరావు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న డాక్టర్ ప్రమీలా రాజకుమారి

రాపూరు : మండలంలోని ఫైలేరియా బాధితులకు సోమవారం కిట్లు పంపిణీ చేసినట్లు వేపినాపి పీహెచ్‌సీ డాక్టర్ ప్రమీలారాజకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాపూరు మండలంలో 135 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. వారికి ప్లాస్టిక్ టబ్, మగ్, టవల్, సోపు, మందులు అందజేశామని తెలిపారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని భూపయ్య గిరిజన కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. వారు సోమ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీకి దారి సౌకర్యం లేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

తెగచర్ల తలారి మృతి



రామసుబ్బమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహ

రాపూరు : మండలంలోని తెగచర్ల గ్రామ తలారి పి.రామసుబ్బమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహ గ్రామానికి చేరుకుని రామసుబ్బమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె అంత్యక్రియలకు రూ.25 వేలు అందజేశారు. ఆయన వెంట డీటీ అశోక్, ఆర్‌ఐ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు పూజ్యం



ముచ్చలగుంటలో చెరువు కట్ట పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం పది గంటలకే సూర్యుడు భగభగమండుతున్నాడు. ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి పనులు చేసే కూలీలు ఎండలకు ఇబ్బంది పడుతున్నారు. వారికి పనిప్రదేశంలో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఎండలకు తాళలేక కూలీలు సొమ్మసిల్లి పడిపోతున్నారు.



మేలనాలతూరు చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

- ఎండలకు అల్లాడుతున్న వైనం
- కనిపించని సహాయక చర్యలు
- పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, తడ, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట, సూళ్లూరుపేట మండలాల్లోని అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. దీంతో ఉపాధి హామీ కింద ప్రతి గ్రామంలోనూ చెరువు పూడికతీత, పంట కాలువల అభివృద్ధి, పశువుల గుంతలు, నీటి గుంతలు తదితర పనులను చేస్తున్నారు. ఇతర పనులు ఎక్కడా దొరకకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది. పని చేసే ప్రదేశంలో వసతులు లేకపోవడంతో ఎండ తీవ్రతతో కూలీలు అల్లాడుతున్నారు. గతంలో పనులు జరిగే ప్రాంతంలో టార్పాలిన్ పట్టలతో గుడారాలు వేసేవారు.

అదేవిధంగా తాగునీటి సదుపాయం కల్పించేవారు. పనులు చేసి నీరసించే వారికోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కూలీల గురించి పట్టించుకోవడం లేదు. పని ప్రదేశంలో సరైన వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉపాధి సిబ్బంది ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడే ఎండలు మండిపోతుంటే మేలో పనులు ఎలా చేయాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికీ అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.

మండలా వారిగా ఉపాధి కూలీల వివరాలు..

మండలం	కుటుంబాల సంఖ్య	జాబ్ కార్డులు	కూలీలు	రోజూ పనులు చేసే కూలీలు
దొరవారిసత్రం	14,963	9,477	37,240	1,151
పెళ్లకూరు	15,326	3,410	33,520	1,320
నాయుడుపేట	19,664	6,461	42,187	674
సూళ్లూరుపేట	11,482	7,556	25,941	726
తడ	15,493	9,629	31,981	1,050
ఓజిలి	10,235	9,121	17,366	1,027

తాగునీరు కూడా పెట్టడంలేదు



ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో తాగునీరు కూడా పెట్టడం లేదు. బాటిళ్లలో తీసుకెళుతున్న నీరు సరిపోవడంలేదు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు నీడ ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఓదూరు మనోహర్, ఏకొల్లు

ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు



ఎండను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తున్నాం. ఎండ తీవ్రతకు కూలీలు నీరసించి సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి. ఎక్కడా పెట్టడం లేదు. అధికారులు స్పందించాలి.

– సమ్మన వీరయ్య, ఆనేపూడి

అన్ని చర్యలు తీసుకుంటున్నాము



ఉపాధి పనులు చేసే కూలీల కోసం అన్ని సహాయక చర్యలు చేపడుతున్నాము. ఎండ ఎక్కువగా కాయకముందే ఉదయం 10 గంటల లోపే పనులు ముగించాలి. పని చేసే ప్రాంతంలో కూలీల కోసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాము.

– కె.గోవర్ధన, ఎంపీడీవో, డీవీ సత్రం

నేడు మండల సమావేశం

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

హనుమంతుడిపై భక్త వరదుడి చిద్విలాసం



చిల్లకూరు : తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి బ్రహోత్సవాల్లో రెండో రోజు సోమవారం స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామికి విశేష పూజలు చేశారు. సాయంత్రం హనుమంత వాహనం చేపట్టారు. గమ్మళ్లదిబ్బ, కొత్తూరు గ్రామాలకు చెందిన మత్స్యకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను ఆలయ ఈవో గిరిక్రిష్ణ పర్యవేక్షించారు.

సంఘాలను బలోపేతం చేయండి

సైదాపురం : మండలంలో ఉన్న పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఏపీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం సైదాపురంలోని పొదుపు కార్యాలయంలో వెలుగు సీసీలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సంఘాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు ఇప్పించాలన్నారు. వివిధ పథకాలకు సంబంధించిన రుణాల రికవరీని వేగవంతం చేయాలని సూచించారు.

తూతూమంత్రంగా గూడలి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలు ప్రారంభమైన మూడు రోజుల తర్వాత ముఖ ద్వారానికి రంగులు వేస్తున్న దృశ్యం



అలస్యంగా వేస్తున్న చలువ పందిళ్లు

- కనిపించని ఆలయ అధికారులు
- ఆలయాన్ని శుభ్రం చేయకపోవడంపై భక్తుల ఆగ్రహం

కోట : గూడలిలో వెలసిన కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 5 నుంచి 15 వరకు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని దేవదాయశాఖ అధికారులు ప్రకటించినా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులవుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. కనీసం ఆలయాన్ని శుభ్రం చేయించలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. గూడలి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. పది రోజులు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఆదాయం కూడా బాగానే వస్తుంది. గత ఏడాది వరకు కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేవారు. రూ.5 లక్షల కన్నా తక్కువ ఆదాయం ఉందన్న కారణంతో ఈ ఏడాది కమిటీని నియమించలేదు. తామే బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులైనా ఆలయాన్ని శుభ్రం చేయలేదు. ఆలయ గోపురాలన్నీ దుమ్ము, దూళితో నిండిపోయాయి. బ్రహ్మోత్సవాలకు ప్రచారం కరువైంది. ముద్రించిన కరపత్రాలు గ్రామాల్లో పంచకుండా మూలన పడేశారు. గ్రామపెద్దలు ముందుకు వచ్చి ఆలయానికి రంగులు వేయిస్తున్నారు. దేవదాయశాఖ ఈవో శశాంక్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, హుండీలోని కానుకల లెక్కింపు రోజున వచ్చి నగదు తీసుకెళ్లడం తప్ప తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గూడలి సంగమేశ్వరుని పవిత్రతను కాపాడాలని భక్తులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని రైతు పొలంలోని షెడ్‌లో చోరీ చేసిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ గూడూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లోక నాథం సోమవారం తీర్పు చెప్పారు. గూడూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. బండి సుబ్రహ్మణ్యం అనే రైతు గూడూరు గ్రామ దేవత తాళ్లమ్మ గుడి వెనక పొలంలో షెడ్ నిర్మించుకున్నాడు. 2024 ఆగస్టు 25న అందులో ఉన్న రాగి వైరు, పైపులు, ఐరన్ షీట్లు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి విందూరు రోడ్డుకు చెందిన యల్లం శీనయ్యను అరెస్టు చేశారు. కోర్టులో విచారణ జరిగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు.

చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

కలువాయి(సైదాపురం) : మండలంలోని దాచూరు గ్రామంలో చెన్నకేశవల స్వామి ఆలయ నూతన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ప్రస్తుతం చిన్న ఆలయం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ.1.50 లక్షలు విడుదల చేసింది. గ్రామస్తులు రూ.20 లక్షలు అందజేశారు. ఈ క్రమంలో ఆలయ పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

వెంకటగిరి రూరల్ : ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి కోరారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని వెల్లడించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కోట : మండలంలోని వీరారెడ్డిసత్రంలో నమోదైన అట్రాసిటీ కేసుపై గూడూరు డీఎస్పీ గీతాకుమారి సోమవారం విచారణ చేపట్టారు. వీరారెడ్డిసత్రానికి చెందిన జయమ్మ, నరసింహలును అదే గ్రామానికి చెందిన మస్తానయ్య కులం పేరుతో దూషించినట్లు పోలీసులు ఈ నెల 3న కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ గీతాకుమారి గ్రామానికి చేరుకుని సాక్షులను విచారించారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న సంస్థ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణానికి చెందన డాక్టర్ సీఆర్‌రెడ్డి కుటుంబ సభ్యులు డాక్టర్ జనార్ధనరెడ్డి, రోహిణి ప్రతి నెలా ఆరోగ్య సంజీవని పేరుతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో సుమారు 30 మందికి పౌష్టికాహారం అందజేశారు. ప్రగతి సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా బేగం, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తాత్కాలిక కమిటీలే దిక్కు



శ్రీ బాలాంజనేయస్వామి ఆలయ కమిటీకి తాత్కాలిక కమిటీ వేయడంతో పర్మినెంట్‌గా పేర్లు వేసుకున్న దృశ్యం

సూళ్లూరుపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఆలయాలకు పాలక మండళ్లను నియమించడం లేదు. తాత్కాలిక కమిటీలతోనే నెట్టుకొస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న విభేదాల నడుమ పాలక మండలి చైర్మన్లుగా ఎవరిని నియమించాలో తెలియక అధిష్టానం తలలు పట్టుకుంటోంది. నియోజకవర్గ టీడీపీలో కొండేపాటి గంగా ప్రసాద్, వేనాటి సతీష్‌రెడ్డి, నెలవల సుబ్రమణ్యం మూడు వర్గాలుగా విడిపోయారు. సూళ్లూరుపేటలో టీడీపీ కార్యాలయం వుండగా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మరో కార్యాలయం ఏర్పాటు చేయడం వీరి మధ్య నెలకొన్న విభేదాలకు నిదర్శనం. వేనాటి సతీష్‌రెడ్డి నేరుగా పార్టీ అధినేత చంద్రబాబు, లోకేష్‌తో సంబంధాలు నెరుపుతున్నారు. వారి అండదండలతోనే ఎమ్మెల్యే విజయశ్రీకి సంబంధం లేకుండానే రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి చెక్కులు అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే కొండేపాటి ముఖ్య అనుచరుడు తిరుమూరు సుధాకర్‌రెడ్డి చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ పాలక మండలి చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. దీన్ని వేనాటి వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. ఇన్ని వివాదాల నేపథ్యంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు నాగేశ్వరస్వామి ఆలయానికి తాత్కాలిక పాలక మండలిని నియమించారు. శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహించేందుకు శ్రీ బాలాంజనేయస్వామి ఆలయానికి తాత్కాలిక పాలకమండలిని నియమించారు. ఇవే అసలు సిసలైన కమిటీలని తెలుగుతమ్ముళ్లు భావించి ఆలయాల ముందు పాలకమండలి బోర్డులో పేర్లు వేసుకుంటున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



చిట్టమూరు : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

చిట్టమూరు : కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు సరైన ఆహార నియమాలు పాటించాలని చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మావతి తెలిపారు. చిట్టమూరులో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యం అనేది దేశ భవిష్యత్‌కు అత్యవసరమన్నారు. శారీరక శ్రమ కలిగినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, అందుకు వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి

నాయుడుపేట టౌన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.సంయుక్త తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం అర్బన్ హెల్త్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు పాటించడంతోపాటు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. అనంతరం జడ్జి సంయుక్త, డాక్టర్ సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకిష్టయ్య, న్యాయవాదులు మండిగ సోమశేఖర్, చిట్టేటి నారాయణ, పరశురామ్, మోహన్‌కృష్ణ, సుమన్, ఎస్‌ఐ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

వెంకటగిరి రూరల్ : పిడుగురాళ్లలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ –19 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపినట్లు జిల్లా ప్రెసిడెంట్ దేవరాజ్, సెక్రటరీ మనోహర్ తెలిపారు. వారు త్వరలో లక్నోలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

గ్రామాల్లో బెల్టు తీసేదెన్నడో..?



మద్యంపై పోరుబాట(ఫైల్)

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రైవేట్ మద్యం పాలసీ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆదాయ వనరుగా మారింది. బడా నాయకులు టెండర్లలో మద్యం షాపులను దక్కించుకోగా, కార్యకర్తలు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఊరూవాడా తేడాలేకుండా ప్రొవిజనల్ షాపులు, టీ అంగళ్లలోనూ మద్యాన్ని విక్రయిస్తున్నారు. పల్లె జనం మద్యం మత్తులో తూలుతున్నారు. బెల్టు షాపులను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- విచ్చలవిడిగా బెల్టు షాపుల ఏర్పాటు
- జోరుగా మద్యం విక్రయాలు
- తాగి తూలుతున్న పల్లె జనం
- పట్టించుకోని అధికారులు



మండలంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న బెల్టు షాపులు

పెళ్లకూరు: మండలంలోని 24 పంచాయతీలకుగాను పెళ్లకూరు, చెంబేడు గ్రామాల్లో అధికారికంగా రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇతర గ్రామాల వారు పెళ్లకూరు, చెంబేడుకు మద్యం కోసం రావాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కూటమి నేతలు ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటికి ఆటోలు, బైక్‌ల ద్వారా మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా రాజుపాళెం, దొడ్లవారిమిట్ట, చావలి, కానూరు, చిల్లకూరు, పాలచ్చూరు, పుల్లూరు, కలవకూరు, నెలబల్లి, పునబాక తదితర గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు జోరుగా సాగుతున్నాయి. బాటిల్‌పై ఎమ్మార్పీకి అదనంగా బ్రాండ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.80 వరకు వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసిన కొందరు యువకులపై నిర్వాహకులు దాడులు చేసిన దాఖలాలు చాలానే ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

బెల్టు షాపులు పెట్టి యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పగలంతా కష్టం చేసి సంపాదించిన మొత్తాన్ని తాగుడుకు ఖర్చు చేస్తుండడంతో కుటుంబాల పోషణ కష్టంగా ఉందని మహిళలు వాపోతున్నారు. బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మద్యం రక్కసికి చిన్నాభిన్నమై కుటుంబాలు నాశనం అవుతుండడంతో స్థానిక జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, పలువురు మహిళా ఎంపీటీసీలు, సర్పంచులు ఇటీవల మద్యంపై పోరుబాట కార్యక్రమం చేపట్టారు. అయినప్పటికీ అధికారుల్లో మార్పు రాలేదు. మామూళ్లు తీసుకుని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్టుషాపులు మూసేయాలి



గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపులను వెంటనే మూసేయాలి. అధికార పార్టీ నాయకులంతా ధనార్జన లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పేదల జీవితాలను మద్యం రక్కసికి బలి చేస్తున్నారు. ఇలా అయితే సామాన్య కుటుంబాలు వీధిన పడాల్సిందే.

– శ్రీదేవి, నెలబల్లి

ఇచ్చిన మాటకి కట్టుబడాలి



ఎన్నికల్లో మద్యం బెల్టు షాపులు లేకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక వారే మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇచ్చిన మాటను గాలికి వదిలేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రెండు షాపులు మినహా బెల్టు షాపులు లేకుండా చూడాలి.

– నాగరాజమ్మ, పాలచ్చూరు

21 బ్లాక్‌లుగా కడివేడు సర్వే

చిల్లకూరు : కడివేడు రెవెన్యూలో భూములను రీ సర్వే ప్రక్రియను గత నెలలో చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కడివేడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో బృందాలు బౌండరీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చిల్లకూరు, ఓజిలి మండలాల మధ్య ఉన్న కొన్ని భూములపై లెక్కలు తేలాల్సి ఉందని, వాటిని రెండు మండలాలకు చెందిన సర్వేయర్లు సంయుక్తంగా సర్వే చేస్తున్నట్టు వివరించారు. అది పూర్తయిన వెంటనే 21 బ్లాక్‌లుగా విభజించి కడివేడును 11 సర్వే బృందాలతో సర్వే చేస్తామన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. సర్వే రిపోర్టును జాయింట్ కలెక్టర్ పరిశీలించి సలహాలు ఇస్తున్నారని తెలిపారు. ఆయన వెంట సర్వేయర్ మల్లికార్జున్ ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పెళ్లకూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.నాగరాజు హెచ్చరించారు. ఆయన సోమవారం రాత్రి చెంబేడు గ్రామంలోని మద్యం షాపు వద్ద మందుబాబులతో మాట్లాడారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మద్యం షాపు యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జన సంచారం ఉన్న చోట, పాఠశాలలు, ఆలయాలు, ఆస్పత్రుల వద్ద మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.